
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



సోమశిలలో 60.774 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 60.774 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1070 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.89,010
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,045
3 శాతం జీఎస్టీతో	రూ.8,286
నవర (8 గ్రా)	రూ.66,288

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34.7 /24.2

జిల్లాలో వాతావరణం ఆదివారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 65 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వీఎస్‌యూ అభివృద్ధికి కృషి చేస్తా

• వీసీ అల్లం శ్రీనివాసరావు



వీఎస్‌యూ వీసీగా బాధ్యతలు స్వీకరించిన అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) అభివృద్ధికి కృషి చేస్తానని వీసీ అల్లం శ్రీనివాసరావు తెలిపారు. నూతన వీసీగా ఆయన శనివారం కాకుటూరులోని వీఎస్‌యూలో కుటుంబ సభ్యులు, గురువుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో వీఎస్‌యూ ప్రధాన భూమిక పోషించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్‌ను మెరుగుపరిచే ఉత్తమ విద్యను అందించేందుకు వీఎస్‌యూ నిరంతరం కృషి చేస్తుందన్నారు. పరిశోధనలకు ప్రాధాన్యతనిస్తూ, సమాజానికి ఉపయోగపడే విధంగా కార్యాచరణ రూపొందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. పరిశ్రమల భాగస్వామ్యం పెంపొందించి, విద్యార్థులకు కొత్త అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. పాలకులు, అధ్యాపకులు, విద్యార్థుల సమష్టి సహకారం అవసరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు సుజా ఎస్. నాయర్, డాక్టర్ కిరణ్మయి, కళాశాల డీన్లు ఎన్వీ రమణారెడ్డి, విజయానంద్ కుమార్‌బాబు, డాక్టర్ హుస్సేనయ్య, ప్రిన్సిపల్స్ సీహెచ్ విజయ, డాక్టర్ టి వీరారెడ్డి, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చెడ్డ పేరు తెస్తే కఠిన చర్యలు

• డ్వామా పీడీ గంగాభవాని



మాట్లాడుతున్న గంగాభవాని

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల ఫొటోలకు బదులు ఇతర ఫొటోలు అప్‌లోడ్ చేసి జిల్లాకు చెడ్డ పేరు తీసుకువచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ గంగాభవాని హెచ్చరించారు. శనివారం డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల ఏపీఓలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. వివిధ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు పనులకు సంబంధించి కాకుండా ఇతర ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారన్నారు. ఈ విషయంపై ఆయా పంచాయతీల ఎఫ్ఏలకు షోకాజు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ఇకపై ఇటువంటి పొరపాట్లు జరిగితే సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ప్రయోజనం చేకూరే పంట కుంటల లక్ష్యాలను వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 4,590 పంట కుంటలు నిర్మించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కూలీలతోనే పనులు చేయించి పంట కుంటలు నిర్మించాలన్నారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలని తెలిపారు.

సీఎం పర్యటనకు పటిష్ట భద్రత



సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న ఎస్పీ

నెల్లూరు (క్రైమ్): సీఎం చంద్రబాబు జిల్లా పర్యటనకు ఎస్పీ జి.కృష్ణకాంత్ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో ఆదివారం జరగనున్న టీడీపీ నేత బీద రవిచంద్ర కుమారుడి వివాహ వేడుకల్లో సీఎం పాల్గొననున్నారు. 902 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం పర్యటించే ప్రాంతాలను శనివారం ఎస్పీ పరిశీలించారు. బందోబస్తు విధుల్లో పాల్గొంటున్న పోలీసు అధికారులు, సిబ్బందికి ఆయన దిశానిర్దేశం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ హెలిప్యాడ్ నుంచి వీపీఆర్ కన్వెన్షన్ వరకు ప్రతి ప్రదేశాన్ని బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు చేయాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. అనంతరం ట్రయల్ కాన్వాయ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మునిరాజ, ఇంటెలిజెన్స్ ఏఎస్పీ కృష్ణారావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

902 మందితో బందోబస్తు

సీఎం పర్యటన నేపథ్యంలో 902 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ, ఏడుగురు డీఎస్పీలు, 26 మంది సీఐలు, 60 మంది ఎస్ఐలు, 169 మంది ఏఎస్ఐ/హెచ్‌సీలు, 266 మంది పీసీలు, 79 మంది మహిళా ఏఎస్ఐలు, హెచ్‌సీలు, పీసీలు, 120 మంది హోమ్ గార్డులు, 54 మంది స్పెషల్ పార్టీ, 120 మంది ఏఆర్ సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు.

మిర్చి ధరలు నేలవైపు
రైతు బేలచూపు


మిర్చి సాగు చేసిన రైతులకు ఈ ఏడాది కన్నీళ్లు వస్తున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి రైతులు పంట పండించారు. సాగులో ఆరుగాలం శ్రమించి చీడపీడలు, తెగుళ్లు, నీటి ఎద్దడి వంటి సమస్యలు అధిగమించి పంట పండించినా చివరికి రేటు పాతాళానికి పడిపోవడంతో రైతులకు గుండె జారినట్లయింది. ధరలు భారీగా పతనం కావడంతో అన్నదాతలు కుమిలిపోతున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడులూ రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతుకు ఈ ఏడాది నష్టాల ఘాటు

- ధరలు క్వింటాలు రూ.22 వేల నుంచి రూ.13 వేలకు పతనం
- దిగుబడీ అంతంత మాత్రమే
- పెట్టుబడికి చేసిన అప్పులు తీర్చేదెలా దేవుడా అంటూ అన్నదాతల ఆక్రందన
- వైఎస్సార్‌సీపీ పాలనలో రైతన్నకు లాభాలు
- చంద్రబాబు పాలనలో దినదిన గండాలు



ఈ చిత్రంలో యువకుడి పేరు ధనుష్ కుమార్. కావలి పట్టణంలోని ఒక జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. రైతు కుటుంబానికి చెందిన ఈ యువకుడు ఇటీవల కాలేజీకి వెళ్లడం లేదు. మిర్చి పంట కోసే కూలీలకు రోజుకు రూ.350 కూలి ఇస్తారు. పంట చేతికి వచ్చే సమయంలో కూలీల కొరత కూడా ఏర్పడుతుంది. తల్లిదండ్రులు పేదవారు కావడంతో కూలీల ఖర్చు భారంగా మారింది. ఈ క్రమంలోనే ఈ యువకుడు తాను కూడా మిర్చి కోతకు వెళితే ఒక కూలీకి చెల్లించే డబ్బులు తల్లిదండ్రులకు మిగులుతాయని నిశ్చయించుకున్నాడు. దీంతో కాలేజీకి వెళ్లకుండా మిర్చి కోతకు వెళ్తున్నాడు.





ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు చలంచర్ల మనోహర్. ఒక్క ఎకరా మిర్చి సాగు చేశాడు. ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి ఖర్చు అయింది. గత ఐదేళ్ల పాటు మిర్చి ధరలు క్వింటాలుకు (100 కేజీలు) రూ.22,000 నుంచి రూ.28,000 ధరలు పలికాయి. కానీ ఈసారి మాత్రం నాణ్యత కలిగిన మిర్చి క్వింటాలు ధర రూ.13,000 మాత్రమే పలుకుతుండడంతో దిగులు పెట్టుకున్నాడు. కనీసం పెట్టుబడి రాకపోగా, అప్పులు పాలైపోతానని ఆందోళన చెందుతున్నాడు.

కావలి: జిల్లాలో అనంతసాగరం, మర్రిపాడు, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి, సంగం, ఆత్మకూరు, పొదలకూరు, కావలి, దగదర్తి మండలాల్లో దాదాపు 4,500 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఈ ఏడాది మిర్చి ధరలు పతనమై పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యాపారుల దగ్గర తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని ఆవేదన చెందుతున్నారు.

ధరలు భారీగా పతనం

గుంటూరు మార్కెట్ యార్డ్‌లో క్వింటా మిర్చి నాణ్యతను బట్టి రూ.8,000 నుంచి రూ.13,000 వరకు అడుగుతున్నారని రైతులు చెబుతున్నారు. గతేడాది ఫిబ్రవరిలో క్వింటాలుకు రూ.22,000 నుంచి రూ.28,000 వరకు ధర పలికింది. వాణిజ్య పంటల్లో పొగాకు, తేయాకు, పసుపు తదితర పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తోంది. మిర్చికి మాత్రం ప్రకటించడం లేదు. దీంతో వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాం 2019 నుంచి 2024 వరకు ధరలు మెరుగ్గా ఉన్నాయి. గత ఐదేళ్లలో సగటు ధర రూ.22,000 తగ్గలేదు. గరిష్ఠంగా రూ.28,000 వరకూ పలికింది. ప్రస్తుతం తేమ శాతం, తాలు సాకులు చూపి ధరను రూ.7,000 లకు తగ్గించేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

సరుకంతా ఎటుపోతోంది..?

ఎగుమతులు లేవని చెబుతున్న వ్యాపారులు గుంటూరులోని మిర్చి యార్డ్‌కు ఎంత సరుకు వచ్చినా కొనేస్తున్నారని, తాము పండించిన సరుకు అంతా ఎటు పోతుందోనని రైతులు ప్రశ్నిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో మిర్చి రిటైల్ ధర కిలో రూ.200 నుంచి రూ.220 వరకు పలుకుతుండడాన్ని వారు గుర్తు చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మిర్చి రైతుల గోడును ప్రపంచానికి చాటి చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వంలో చలనం వచ్చింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాలని కేంద్రం ప్రతిపాదించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని, మొత్తం కేంద్రమే భరించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ అంశంపై ఇంతవరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పందన లేదు. కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.20,000 ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.



మిర్చిని ఎండ బెడుతున్న రైతు

ఎకరానికి రూ.లక్ష వరకు నష్టం

మిర్చి ధరలు గణనీయంగా తగ్గిపోవడంతో ఎకరానికి రూ.2 లక్షలు వరకు పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఎకరానికి లక్ష రూపాయల పైనే రైతులు నష్టపోనున్నారు. గత సంవత్సరం క్వింటాలు మిర్చి రూ.22,000 పలికిన ధర ఈ ఏడాది రూ.8,000 రూ.13,000 లోపలనే ఉంది. ధరలు సగానికి పైగా పడిపోయాయి. పంటను అమ్ముకోలేక కోల్డ్ స్టోరేజీ గిడ్డంగుల్లో దాచుకునే స్థోమత లేక, పెట్టుబడికి వడ్డీలు కట్టలేక రైతులు మనోవ్యధకు గురవుతున్నారు. లాభాలు కాదు కదా... కనీసం కూలీ ఖర్చులూ.. రాకపోవడంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. మిర్చి ధరలు నేలచూపులు చూస్తుండడంపై దేవుడా ఏంటీ ఈ పరిస్థితి అని రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. సీజన్ మొదట్లోనే ధర తగ్గితే చివరికి ఎంత పతనం అవుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

దుస్థితిలో మిర్చి రైతులు

సాధారణంగా మిర్చి ఎకరాకు 15 నుంచి 18 కింటాళ్ల దిగుబడి వస్తుంది. ఎకరాకు రూ.2 లక్షలు వరకు పెట్టుబడి అవుతోంది. పొలం కౌలుకు తీసుకుంటే మరో రూ.25,000 అదనం అవుతుంది. ఇక పైరుకు చీడపీడలు, తెగుళ్లు సోకితే వాటి నివారణకు మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. అప్పుడు మరి కొంత పెట్టుబడి పెరుగుతోంది. అలాగే పైరులో మిర్చి కోత కూలీలకు రోజుకు రూ.350 చెల్లించాలి. ఇది కూడా అత్యంత కీలకమైన పెట్టుబడి. దుక్కి, ఎరువులు, పురుగు మందులు, కోత కూలీలు, గుంటూరు యార్డుకు తరలించడం రవాణా తదితర వాటికి పెట్టుబడి కోసం అప్పులు చేస్తుంటారు. మిర్చి ధరలు పడిపోవడంతో అప్పులు ఇచ్చిన వారు వడ్డీతో కలిపి చెల్లింపులు చేయమని రైతులపై ఒత్తిడి చేయడం ప్రారంభించారని కొందరు రైతులు తెలిపారు.

ఇక మిర్చి సాగు చేయలేం

మిర్చి ధరలు ఇంత ఘోరంగా ఎప్పుడూ లేవు. మిర్చి ధరలు గురించి చెబుతుంటే వినాలంటేనే భయం వేస్తుంది. ఇంటిల్లిపాది ఎనిమిది నెలల పాటు మిర్చి పైరు సేద్యం చేసినా కనీసం కూలీ కూడా రావడం లేదు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చడానికి నరకం అనుభవించాల్సిన దుర్గతి పట్టింది. ఇక మిర్చి సాగు చేయలేం.

– అచ్చయ్య, మిర్చి రైతు, రాజువారి చింతలపాళెం

పెండింగ్ బకాయిలపై పోరాటానికి సిద్ధం

• ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు



మాట్లాడుతున్న ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

నెల్లూరు(అర్బన్) : ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లింపుపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆ సంఘం మెన్ అండ్ ఉమెన్ జిల్లా కార్యవర్గ సమావేశం నగరంలోని ఓ అతిథి గృహంలో జరిగింది. బొప్పరాజు మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వంతో పలుమార్లు చర్చలు జరిపామన్నారు. పూర్తిస్థాయిలో విడుదల చేయకపోతే మరో పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. పీఆర్‌సీతోపాటు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అన్ని శాఖల ఉద్యోగులు ఐక్యంగా ఉండి పోరాడితే పరిష్కారమవుతాయన్నారు. అనంతరం ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కార్యవర్గంలో కో చైర్మన్‌గా కీలక బాధ్యతలు నిర్వహించి జనవరిలో ఉద్యోగ విరమణ పొందిన పాదిలి చిన్నయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఆఫీసర్ల రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వరరావు, ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి, కార్యదర్శి ప్రసాద్, ఫైర్ శాఖ అధ్యక్షుడు చంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు, డ్రైవర్స్ సంఘం అధ్యక్షుడు చిరంజీవి, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నాయకులు డానియేల్, పీటర్ రావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఆర్వో ఉదయభాస్కరరావు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో ఉదయభాస్కరరావు ఆదేశించారు. శనివారం డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో చీఫ్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్లకు పరీక్షల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన వసతులను పరిశీలించి వెంటనే వారికి సదుపాయాలను కల్పించాలన్నారు. ఆర్ఐఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు ఫస్టియర్‌కు 28,176 మంది, సెకండియర్‌కు 25,024 మంది హాజరవుతున్నట్లు చెప్పారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఐదు సిట్టింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల్లో సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్ రూమ్ 0861–2320312 నంబర్‌ను ఏర్పాటు చేశామన్నారు. సమస్యలు, ఇబ్బందులపై ఈ నంబరుకు విద్యార్థులు ఫోన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో డీవీఈఓ మధుబాబు, డీఈసీ కమిటీ సభ్యులు వేణుగోపాల్, కొండయ్య, డిస్ట్రిక్ట్ బల్క్ ఇన్‌చార్జి రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఇజ్తిమా ప్రారంభం



ఇజ్తిమాలో మత ప్రవక్త బోధనలకు హాజరైన ముస్లింలు

కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురంలో రాష్ట్ర స్థాయి ఇజ్తిమా శనివారం ప్రారంభమైంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ముస్లింలు తరలి వచ్చారు. ప్రపంచ శాంతి కోసం శని, ఆదివారాల్లో ఇక్కడ ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. శనివారం పలువురు మతబోధకులు బోధనలు, ప్రార్థనలు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు నీళ్ల బాటిళ్లు ఉచితంగా పంపిణీ చేయడంతోపాటు అన్నదానం చేశారు. ఇజ్తిమాకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సైలు కోటిరెడ్డి, నరేష్, సీఐ సురేంద్ర బాబు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


42 కేజీల వెండి స్వాధీనం



కారులో అక్రమంగా తరలిస్తున్న వెండిని పరిశీలిస్తున్న పోలీసులు

వెంకటాచలం: చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్లే కారులో అక్రమంగా తరలిస్తున్న 42 కేజీల వెండిని వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద సీఎస్ఎస్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. సీఎస్ఎస్ సీఐ సీతారామయ్య ఆధ్వర్యంలో వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారును తనిఖీ చేశారు. కారులో సుమారు రూ.45 లక్షలు విలువ చేసే 42 కేజీల వెండిని గుర్తించారు. వెండితోపాటు కారును, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

రాజరాజేశ్వరిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



అమ్మవారి సన్నిధిలో కుటుంబ సభ్యులతో న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథ్‌శర్మ

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.హరిహరనాథ్‌శర్మ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవస్థానం ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, అర్చకులు న్యాయమూర్తిని సంప్రదాయంగా ఆహ్వానించారు. సుందరేశ్వర స్వామి వారిని దర్శించుకుని, తదుపరి ప్రత్యేకంగా నవావరణ పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు హరిహరనాథ్‌శర్మ దంపతులకు వేద ఆశీర్వచనాలు చేసి పట్టువస్త్రాలు, తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

గ్రేడ్-3 ఏఎన్ఎం ప్రమోషన్ల సీనియారిటీ జాబితా విడుదల

నెల్లూరు(అర్బన్): ప్రమోషన్లు కల్పించేందుకు జిల్లాలోని సచివాలయాల గ్రేడ్-3 ఏఎన్ఎం (ఎంపీహెచ్ఏ-ఎఫ్) ఫైనల్ సీనియారిటీ జాబితాను ర్యాంకుల వారీగా విడుదల చేశామని డీఎంహెచ్ఓ సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితా వివరాలు, ఖాళీల వివరాలు spsnellore.ap.gov.in/notice/recruitment అనే వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు.

మంత్రుల సమీక్ష సాక్షిగా..
రోడ్డెక్కిన రైతాంగం

- గిట్టుబాటు ధరల కోసం కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- ఇందుకూరుపేట నుంచి భారీ ర్యాలీ
- ఈ సారికి సహకరించాలంటూ ప్రాధేయపడిన మంత్రి
- పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు
- 24 గంటల్లో రైతుల అకౌంట్లో నగదు
- అధికారులతో రాష్ట్ర మంత్రులు నాదెండ్ల, ఆనం సమీక్ష



మంత్రి నాదెండ్ల మనోహర్‌ను నిలదీస్తున్న రైతు సంఘ నాయకులు

నెల్లూరు (పొగతోట): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, రైతులకు మద్దతు ధర అంశాలపై పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమీక్ష సాక్షిగా అన్నదాతలు రోడ్డెక్కారు. మద్దతు ధర లభించడం లేదంటూ ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘం, ఏపీ వ్యవసాయ, కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులు ఇందుకూరుపేట నుంచి కలెక్టరేట్ వరకు కాలినడకన ర్యాలీగా తరలివచ్చారు. రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లర్లతో సంబంధం లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలంటూ కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. మంత్రుల సమీక్ష సమయంలోనే రైతు సంఘ నాయకులు ఆందోళనకు దిగడంతో కలెక్టరేట్ దద్దరిల్లిపోయింది. రైతులను ఎవరిని లోనికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. చివరకు రైతు సంఘ నాయకులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. అయితే మంత్రి రైతు సంఘ నాయకులతో ఈ సారికి సహకరించండి.. మీకు పూర్తి స్థాయిలో మేలు చేస్తామంటూ నచ్చ చెప్పారు. పదేపదే నాయకులు మద్దతు ధర లేదంటూ వివిధ కారణాలు చెప్పినా అవన్నీ వదిలేసేయండి ఈ సారికి మా ప్రభుత్వానికి సహకరించాలంటూ బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఈ పంట పోర్టల్‌లో నమోదు చేయాలని, ఈకేవైసీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మంత్రిని కోరారు. రైతులకు గోనె సంచుల సమస్య లేకుండా ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లో నగదు వారి అకౌంట్లలో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తీసుకుపోయే విధానానికి స్వస్తి పలకాలని కోరారు. తేమ శాతంలో తేడా లేకుండా తూకాల్లో మోసాలకు పాల్పడకుండా రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించి ధాన్యం కొనుగోళ్లలో రైతాంగంతో పాటు మిల్లర్లను భాగస్వామ్యం చేస్తామన్నారు. రైతులు పండించిన నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు మధ్యాహ్న భోజన పథకంలో అందిస్తామని తెలిపారు.

మీడియాకు నో ఎంట్రీ

ధాన్యానికి మద్దతు, కొనుగోలు కేంద్రం ఏర్పాటు, రేషన్ బియ్యం సరఫరా తదితర అంశాలపై రాష్ట్ర మంత్రి నాదెళ్ల మనోహర్ కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి మీడియాను అనుమతించలేదు. రైతులకు ప్రయోజనాలు చేకూర్చే సమీక్షకు మీడియాకు అనుమతి ఇవ్వకపోవడం వివిధ అనుమానాలు తావిస్తోంది. అధికారులతో సమీక్ష సమావేశంలో లోటుపాట్లు, ఇతర అంశాలు బయట పడుతాయనే అనుమానంతో మీడియాను అనుమతించలేదని విమర్శలు ఉన్నాయి.



కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగిన రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు

తాళం వేసి వెళ్లిపోవడంతో..

- ఆందోళనకు గురైన పొదుపు మహిళలు

పొదలకూరు: సచివాలయంలో నలుగురు పొదుపు మహిళలను ఉంచి పొరపాటున తాళం వేసి వెళ్లడంతో మహిళలు ఆందోళనకు గురైన ఘటన శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బిట్ – 2 సచివాలయం మిద్దెపైన పొదుపు మహిళలు నలుగురు ఆడిట్ పనులు చూసుకుంటున్నారు. భవనం కింద ఉన్న సచివాలయ ఉద్యోగులు విధులు ముగించుకెళ్తూ పొదుపు మహిళల్ని గమనించకుండా తాళం వేసి వెళ్లిపోయారు. మహిళలు తమ పనులను ముగించుకుని కిందకు వచ్చి చూసి ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. సచివాలయ ఉద్యోగులకు సమాచారం అందించారు. వారు తాళాలిచ్చి వేరే వ్యక్తిని పంపి తలుపు తీయించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకుని ఇళ్లకెళ్లారు.

పూర్వ ప్రాథమిక విద్య కీలకం

కందుకూరు రూరల్: మూడు నుంచి ఐదు సంవత్సరాల వయసున్న పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో కీలకమైందని డీఈఓ ఆర్.బాలాజీరావు అన్నారు. కందుకూరులోని జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణను డీఈఓతోపాటు జిల్లా సమగ్ర శిక్షణ ఏఎంఓ జి.సుధీర్‌బాబులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. అనంతరం కార్యకర్తలు తయారు చేసిన అభ్యసనా సామగ్రి మేళాను వారు తిలకించారు. ఎంఈఓలు కె.సుబ్బారెడ్డి, బి.అజయ్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు షకీలా, లక్ష్మి, ప్రభావతి, ఆర్పీలు పాల్గొన్నారు.



అభ్యసనా సామగ్రిని పరిశీలిస్తున్న డీఈఓ, ఎంఈఓలు

పరుగో పరుగు

- డ్రోన్‌తో పలు ప్రాంతాల పరిశీలన
- పరుగులు తీసిన మందుబాబులు

నెల్లూరు(క్రైమ్): నగర డీఎస్పీ పి.సింధుప్రియ, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావులు శనివారం బాలాజీనగర్ స్టేషన్ పరిధిలోని హరనాథపురం ఎక్స్‌టెన్షన్, ఎస్వీజీఎస్ కళాశాల పరిసరాలు, నిర్మానుష్య ప్రదేశాలు, పాడుబడిన భవంతులను డ్రోన్‌తో పరిశీలించారు. ఖాళీ ప్రదేశాల్లో కొందరు మద్యం తాగుతుండగా డ్రోన్‌ను చూసి పరుగులు తీశారు. అనంతరం డీఎస్పీ స్థానికులతో సమావేశమయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నెల్లూరు నగరాన్ని డ్రోన్ నిఘా నీడకు తీసుకొచ్చామన్నారు. ఇప్పటికే వేదాయపాళెం, సంతపేట, నవాబుపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రోన్ల సహాయంతో పేకాటాడుతున్న జూదరులను, బహిరంగంగా మద్యం తాగుతున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేశామన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో డ్రోన్‌ను ఎగురవేస్తూ..











సింహపురిలో పెళ్లిసందడి

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరంలో కల్యాణ మండపాలు వివాహ వేడుకలతో కళకళలాడుతున్నాయి. ఇక్కడ వందకు పైగా చిన్న, పెద్ద మండపాలున్నాయి. అవి ఈ మాసమంతా బిజీగానే ఉన్నాయి. ఒక వివాహానికి రూ.25 వేల నుంచి రూ.2 లక్షల వరకు అద్దె చెల్లించాల్సి వస్తుంది. డెకరేషన్ కోసం రూ.20 వేల నుంచి రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్న పరిస్థితి ఉంది. వివాహాల నేపథ్యంలో నగరంలోని ప్రధాన మార్కెట్ కాపువీధి, ట్రంకు రోడ్డు, చిన్నబజార్, పెద్దబజార్, స్టోన్‌హౌస్‌పేట, మండపాలవీధి, మినీబైపాస్, మాగుంట లేఅవుట్ తదితర ప్రాంతాలు రద్దీగా మారుతున్నాయి. వస్త్ర దుకాణాలు, ఆ తర్వాత బంగారు నగర దుకాణాలు ఉదయం నుంచి రాత్రి వరకు కొనుగోలుదారులతో సందడిగా కనిపిస్తున్నాయి. చిన్న చిన్న షాపుల్లోనూ వ్యాపారాలు బాగానే జరుగుతున్నాయని సమాచారం. అంతే కాకుండా ఫర్నీచర్ షాప్‌లు కూడా కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. వస్త్ర దుకాణాలైతే అత్యధికంగా మహిళలతో కిటకిటలాడుతున్నాయి. కల్యాణమంటే పలు వర్గాల వారికి ఉపాధి లభించినట్లే. కల్యాణ మండపాల సిబ్బంది నుంచి పురోహితులు, డెకరేషన్ వారు, హైరర్స్, బ్యాండ్ కళాకారులు, వంట బృందాలు, ఫొటో, వీడియోగ్రఫీ విభాగం, బ్యూటీపార్లర్, ఆర్కెస్ట్రా, నృత్య విభాగాలు, ట్రావెలింగ్ ఏజెన్సీల వారికి చేతినిండా పని లభిస్తోంది. అంతేకాకుండా వివాహాలు చేసుకునే వారి గృహాలను పెయింటింగ్స్‌తో అందంగా తీర్చిదిద్దుకుంటున్నారు. దీంతో ఆయా దుకాణాల్లో కూడా వ్యాపారం జోరుగా సాగుతుంది.

కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. స్థానిక జెండాదిబ్బ వద్దనున్న బహుళ ప్రయోజన సౌకర్యార్థం గోదాము (స్టాక్ పాయింట్)ను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీతో క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త రేషన్‌కార్డులను అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, జేసీ కార్తీక్, ఆర్డీఓ పావని, ఏఓ సత్యవాణి, సీడీఓ గుర్రప్ప పాల్గొన్నారు.

రూ.1.25 లక్షల జరిమానా

పొదలకూరు: విరువూరు ఇసుక రీచ్‌లో మైనింగ్ డీడీ బాలాజీ నాయక్ సీజ్ చేసిన రెండు ఇసుక లారీలు, ఒక టిప్పర్‌కు శనివారం రూ.1.25 లక్షల జరిమానా విధించారు. గురువారం రీచ్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా డీడీ తనిఖీలు నిర్వహించి వాహనాలను సీజ్ చేసిన విషయం తెలిసిందే. వాహనదారులు కాంపౌండ్ ఫీజు చెల్లించి రిలీజ్ ఆర్డర్‌ను తెచ్చుకున్నట్లు పొదలకూరు పోలీసులు వెల్లడించారు.









పక్కాగా 'పది' పరీక్షల నిర్వహణ

- ఏఎస్పీడీ, పబ్లిక్ పరీక్షల నిర్వహణ ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి

కందుకూరు రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని ఏఎస్పీడీ, నెల్లూరు జిల్లా పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. కందుకూరులోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ హాల్లో కందుకూరు డివిజన్ పరిధిలోని ఏడు మండలాల ప్రధానోపాధ్యాయులు, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ ప్రిన్సిపల్స్‌కు శనివారం ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. డీఈఓ బాలాజీరావు మాట్లాడుతూ అప్రమత్తంగా ఉండి ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ రామ్‌కుమార్, ఏఎంఓ సుధీర్‌బాబు, కందుకూరు, ఆత్మకూరు ఉప విద్యాశాఖ అధికారులు నరసింహారావు, జానకిరామ్, ఏడు మండలాల ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

శుభకార్యానికి వెళ్తూ..

- ఆటోను ఢీకొన్న కారు
- ఒకరి మృతి
- ముగ్గురికి గాయాలు

మనుబోలు: ఆటోను వెనుక నుంచి కారు ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై కొండూరుసత్రం సమీపంలో శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వెంకటాచలం మండలం కసుమూరు పంచాయతీ పరిధిలోని చింతపాళెం గ్రామానికి చెందిన కొండిపాక శీనయ్య, మామిడి రవి, నలబాకు మస్తానయ్య, పారిచర్ల చిన్న వెంకయ్య గూడూరు సమీపంలోని విందూరు గ్రామంలో శుభకార్యానికి ఆటోలో బయలుదేరారు. ఆటో మనుబోలు మండలం కొండూరుసత్రం సమీపంలో ఉండగా నెల్లూరు నుంచి చెన్నై వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న కొండిపాక శీనయ్య (47) అక్కడికక్కడే మృతిచెందాడు. మస్తానయ్య, చిన వెంకయ్య, డ్రైవర్ మామిడి రవి గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హైవేపై పడిపోయిన ఆటో

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 93
లేయర్ (లైవ్) : 75
బ్రాయిలర్ చికెన్ : 170
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 190
లేయర్ చికెన్ : 127

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.48
సన్నవి : రూ.30
పండ్లు : రూ.22